క్లుప్తంగా

నేడు మంత్రి బొత్స రాక

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం రానున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. పార్టీ సీనియర్ నేత అప్పికొండ శ్రీరాములునాయుడు పేరిట కొత్తగా నిర్మించిన కళ్యాణ మండపంను మంత్రి ప్రారంభిచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, పార్టీ శ్రేణులు హాజరుకానున్నారన్నారు.

బాగెంపేటలో అగ్నిప్రమాదం



కాలిపోతున్న రామాలయ ఆవరణలోని పందిరి

వంగర: మండలంలోని బాగెంపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా వైర్లు తెగి పడి రామమందిరం ఆవరణలోని పందిరిపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. జీఎల్ఎం యుగంధర్‌కు సర్పంచ్ రెడ్డి సత్యవతి సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గత కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య కారణంగానే అప్పుడప్పుడు ఇలా జరుగుతోందని, అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను సర్పంచ్ కోరారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

రామభద్రపురం: మండల కేంద్రంలో చేపడుతున్న ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీని ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ సోమవారం పరిశీలించారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసానిచ్చేలా చర్యలు చేపడుతోందని రూపాయి ఖర్చు లేకుండా అనేక వ్యాధులకు ఆపరేషన్లు, చికిత్సలు చేయించుకునే అవకాశం ఈ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా కల్పిస్తోందని ఆమె తెలిపారు. ఇటీవల ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా పొందే వైద్య సాయం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందని గుర్తుచేశారు. గతంలో తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేవారని, ఇప్పుడు ఈ నిబంధనతో సంబంధం లేకుండా రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తోందన్నారు.

బాల్యవివాహాలు లేని సమాజానికి కృషి



బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రాజాం: బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో పి.కనకదుర్గ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం ద్వారా కలిగే అనర్థాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. 18 ఏళ్ల వయసు దాటిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసి, బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం బాలల హక్కులు, చట్టాలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6న మార్కెట్ ఆశీల వేలం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని రోజువారీ మార్కెట్ ఆశీల వేలంపాట ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఏడాదికి సంబంధించి, రోజువారీ మార్కెట్‌కు రూ.50 వేలు, కబేలాకు రూ.3 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ తర్వాత పొందిన ఎన్.కంబరైన్, రోడ్డు మార్జిన్, కబేలా సర్టిఫికెట్‌ను వేలం సమయంలో డిపాజిట్‌తో పాటు అందజేయాల్సి ఉంటుందన్నారు. రూ. 34.5 లక్షలతో పాటు 18 శాతం జీఎస్టీ అనుసరించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించనున్నామన్నారు. వేలంపాట దక్కించుకున్నవారికి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఆశీల వసూళ్ల హక్కు ఉంటుందన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

బాడంగి: మండలంలోని రావివలస, గూడెపువలస, బాడంగి, ముగడ గ్రామాల్లో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ల ఆధారంగా ఓటుహక్కు వినియోగంపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరితో ఈవీఎంలోని బటన్ ఆధారంగా ఓటు వేయించి, వారు వేసిన ఓటు ఏ గుర్తుకు వెళ్లిందో కూడా ప్రింట్ తీసి, చూపించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇళ్లపట్టాల పంపిణీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి, రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను ఎమ్మెల్యే చేతులమీదుగా సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని అన్నారు. ఇప్పటికే ప్రతీ వర్గంలోని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందని, దీంతో ప్రతీ పేదవాడి సొంతింటి కల సాకారమైందన్నారు. ఇక్కడి మున్సిపాలిటీ పరిధిలో 1741 మందికి ఇళ్లపట్టాలు అందించడం జరిగిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీలు సూచించిన వారికే దక్కేవన్నారు. దీంతో అసలైన లబ్ధిదారులు మోసపోయేవారన్నారు. సీఎం జగనన్న హయాంలో మాత్రం ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగలేదన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల వేళ టీడీపీ–జనసేన కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా పాలన కొనసాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల్లో నిర్మించిన ఇళ్లతో కాలనీలు కాదు.. గ్రామాలే వెలిశాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 25 పంచాయతీలకు చెందిన 368 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లస్థలాలకు సంబంధించి, రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను ఎమ్మెల్యే చేతులమీదుగా సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతీ పేదవాడి సొంతింటి కల సాకారమైందన్నారు. ఇప్పుడు ఇచ్చిన పట్టాలను ఆపద సమయంలో బ్యాంకుల్లో పెట్టి, రుణసదుపాయం కూడా పొందే వీలుందన్నారు. ఇంతటి చక్కని అవకాశం కల్పించినందుకు గాను మనమంతా సీఎం జగనన్నకు రుణపడి ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ సింహాచలం, తహసీల్దార్ రాజారావు, ఎంపీడీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష' ప్రజలకు వరం



యాజమాన్య ఆస్తిహక్కు పత్రాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

- శాశ్వత గృహ హక్కు పత్రాల పంపిణీలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ప్రజలకు వరమని, ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం స్వమిత్వ పేరిట సర్వే చేపట్టి, ప్రస్తుతం నివాసముంటున్న గృహాలు, ఇతర ఆస్తులపై యజమానులకు సర్వహక్కులు కల్పిస్తూ పత్రాలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని రామానుజులపేట, విజయరామపురం, బొద్దవలస గ్రామాల ప్రజలకు యాజమాన్య ఆస్తిహక్కు ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్సీ చేతులమీదుగా సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదివరకు గ్రామపంచాయతీల్లో ప్రజలకు ఆస్తులకు సంబంధించి, ఎటువంటి హక్కుపత్రాలు లేవని, దీంతో వారి భూములు, ఇళ్లు ఆక్రమణకు గురయ్యేవని అయితే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం స్వమిత్వ కార్యక్రమం పేరిట సర్వే చేసి, గ్రామపంచాయతీల్లోని ప్రజల ఆస్తులకు సంబంధించి, హక్కు పత్రాలు అందిస్తోందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి లబ్ధిదారులంతా అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ఏవైతే హామీలు ఇచ్చారో ఆ హామీలన్నీ నెరవేర్చారన్నారు. అంతేకాకుండా ప్రజలకు మేలు జరిగే కొత్త కొత్త కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం అందిస్తున్న యాజమాన్య ఆస్తిహక్కు ధ్రువీకరణ పత్రాలతో సర్వహక్కులు లబ్ధిదారునికి ఉంటాయని, వీటిని బ్యాంకుల్లో పెట్టి, రుణసదుపాయం కూడా పొందవచ్చన్నారు. రాజాం మండలంలోని మూడు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా స్వమిత్వ సర్వే జరిగిందని, 733 మందికి ఈ పత్రాలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిని, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, అన్నపూర్ణ, కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరించాలి

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



అంతకాపల్లిలో మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమ కిట్లు అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆయన పార్టీ మరింత బలోపేతానికి సూచనలు చేశారు. అలాగే మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమ కిట్లు అందజేశారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రతీ ఇంటికి ప్రభుత్వం ద్వారా లబ్ధి జరిగిందని, ప్రతీ లబ్ధిదారుని ఓటు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై పడేలా చూడాలన్నారు. ఇవే సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. అలాగే గతంలో ప్రజలను టీడీపీ మోసగించిన తీరును ఎండగట్టాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించాలన్నారు. సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, తనను కూడా ఆశీర్వదించి, ఎమ్మెల్యేని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీటీసీ బొరోతు కాంతారావు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉంగంటి సూర్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో పరిశీలన

బొబ్బిలి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న స్వయం ఉపాధి దుకాణాలు, చిన్న తరహా పరిశ్రమలను ఎంపీడీవో పి.రవికుమార్ సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా దుకాణాలు, పరిశ్రమల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని, అవసరమైన వారికి రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పరామర్శ

వంగర: మండల కేంద్రానికి చెందిన వీఆర్‌ఏ గొండేల సత్యం ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని మండల వీఆర్‌ఏల సంఘ సభ్యులంతా సోమవారం కలిసి, పరామర్శించారు. అనంతరం సత్యం మృతికి గల కారణాలను ఆయన భార్య సుజానమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వై.అప్పలస్వామి, పి.భూలోక, జనార్ధన, రాము, భాస్కరరావు, జి.అప్పలస్వామి, తదితరులు ఉన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

రాజాం: పట్టణంలో చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని బుచ్చింపేట అర్బన్ పీహెచ్‌సీ(ప్రైమరీ హెల్త్ సెంటర్) వైద్యాధికారిణి అనూష అన్నారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారుల వద్దకు మ్యాపింగ్ ద్వారా నివాసాల వద్దకు వెళ్లి మరీ సిబ్బంది పోలియో చుక్కలు వేశారన్నారు. పట్టణానికి సంబంధించి, శతశాతం మేర కార్యక్రమం జరిగిందన్నారు. కార్యక్రమ విజయవంతానికి కారకులైన ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలందరికీ అభినందలు తెలిపారు.

రేగిడి: పీహెచ్‌సీ పరిధిలో 102 మందికి, బూరాడ పీహెచ్‌సీ పరిధిలో 85 మంది చిన్నారులకు మ్యాపింగ్ ద్వారా సోమవారం ఇంటింటికీ వెళ్లి, పోలియో చుక్కలు వేయడం జరిగిందని వైద్యాధికారులు అసిరినాయుడు, చలం తెలిపారు. శతశాతం మేర కార్యక్రమం పూర్తయిందన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజల వివిధ సమస్యల పరిష్కారానికి సమర్పించిన అర్జీలను ఆయన స్వీకరించి, సంబంధిత అధికారులకు ఆ అర్జీలను అందజేశారు. ప్రతీ అధికారి తమ పరిధిలోని ప్రజాసమస్యలు పరిష్కరించాలని, ఏదైనా సమస్యల పరిష్కారం కాకపోతే సంబంధిత లబ్ధిదారుకు ఏ కారణం చేత ఆయన సమస్య పరిష్కారం కాలేదో వివరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి



రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేస్తున్న కొండంపేట గ్రామస్తులు


రాజాం సిటీ:

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొండంపేట గ్రామస్తులు సోమవారం ఆందోళనకు దిగారు. స్థానిక బొబ్బిలి జంక్షన్‌లోని చీపురుపల్లి రోడ్డు మార్గంలో ఎర్రచెరువు గట్టు ఆనుకుని ఉన్న భారీ వృక్షం కూలిన ఘనటలో కొండంపేట గ్రామానికి చెందిన ముద్దన శ్రీనివాసరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గ్రామస్తులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, బాధిత కుటుంబానికి న్యాయం చేసేంత వరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెట్టు కూలిపోయిందన్నారు. అక్కడి చెట్టు ప్రమాదకరంగా ఉందని తెలిసినప్పటికీ మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించకపోవడమేంటని నిలదీశారు. జరిగిన ప్రాణనష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ అధికారులే స్వయంగా వచ్చి, సమాధానం చెబితే గానీ ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించారు. మూడు గంటల పాటు ఆందోళన కార్యక్రమం కొనసాగడంతో ఆ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సీఐ మోహనరావు, ఆర్ఐ విద్యాసాగర్, మున్సిపల్ ఏఈ వెంకట్‌లు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని, ఆందోళనకారులతో సంప్రదింపులు చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పరిహారం అందేలా చర్యలు చేపడతామని అధికారులు భరోసా ఇచ్చి, ఆందోళనను విరమింపజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వంగర: మండలంలోని అరసాడ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సెక్టోరియల్ ఆఫీసర్(ఎంఈవో) ప్రవీన్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం కేంద్రంలోని సదుపాయాలపై సిబ్బందిని ఆరాతీశారు. ఓటింగ్ సమయం నాటికి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు.

రుచి, శుచి కలిగి ఉండాలి



కందిశ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని కందిశ జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలను విద్యార్థులకు పెట్టాలని సిబ్బందికి తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ అందజేత



పింఛన్ అందించేందుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ రవితేజ్

రాజాం: శ్రీకాకుళం దగ్గరున్న రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన బైరి సిమ్మన్న వద్దకు వలంటీర్ రవితేజ్ సోమవారం వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. కష్టకాలంలో ఈ సొమ్ము తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని లబ్ధిదారు కుటుంబ సభ్యులు అన్నారు. సదరు వలంటీర్ సేవలు, ప్రభుత్వ పనితీరును మెచ్చుకున్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవుని సంబరాలు

రేగిడి: మండలంలో వన్నలి గ్రామంలో శ్రీకృష్ణదేవుని సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్తకోట కుటుంబీకులు నిర్వహించిన ఈ సంబరాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం జిల్లాల్లోని కొత్తకోట వంశీయులంతా ఈ పండగలో పాల్గొని, శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు.

వేదన తీరింది



నాడు



నేడు

చిత్రంలో కనిపిస్తున్నది..ఉంగరాడమెట్ట–అంబకండి రోడ్డు. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దీంతో అటువైపుగా వెళ్లే వారంతా నానా అవస్థలు పడేవారు. ఇదే సమస్యను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల దృష్టికి తీసుకువెళ్లగా, వారి చొరవతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.1.50 కోట్ల వ్యయంతో 5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించారు. చాలారోజుల తర్వాత తమ వేదన తీరిందని, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ మొర విని, సమస్య పరిష్కరించినందుకు గాను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

–రేగిడి

భవిష్యత్ బాగుండాలంటే సీఎం జగనే మళ్లీ రావాలి

- మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు అధ్యక్షతన మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. అన్నివర్గాల ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, అదే విధంగా ఆయన పాలన కూడా కొనసాగిస్తున్నారన్నారు. అన్నివర్గాల్లోని ప్రజలకు మేలు జరిగేలా ఆయన అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు జరిగిన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవని ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి కూడా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఎన్నికల వేళ టీడీపీ–జనసేన కూటమి చెప్పే మాయమాటలను నమ్మవద్దని ప్రజలకు తెలపాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మళ్లీ ఆ పార్టీ నేతలకే పథకాలు, రుణాలు వస్తాయని వివరించాలన్నారు. బొబ్బిలి నియోజకవర్గానికి రాజులు కూడా ఏమీ చేయలేదని, వారిని మళ్లీ నమ్మితే మోసపోవడం ఖాయమన్న విషయం తెలియజేయాలన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీకి చెందిన ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వంగర: వీఆర్‌ఏలంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పి.చిరంజీవి సూచించారు. ఇటీవల ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలంతా ఆయనను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనల సమాచారం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

జోరుగా అభివృద్ధి పనులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. బీసీ, దేవాంగులు, ఎస్సీ కాలనీలకు సంబంధించిన శ్మశాన వాటికలకు సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ ఎస్.వర్షిణి తెలిపారు. ఎస్సీ కాలనీ శ్మశానవాటిక నిర్మాణ పనులను సర్పంచ్ శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.44 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ పనులు చేపడుతున్నామన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. మండల పరిషత్ నిధులతో గ్రామంలోని తెలగవీధి నుంచి ప్రధాన రోడ్డు వరకు కాలువలు నిర్మిస్తున్నట్లు పెరుమాళి ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ పెనుమత్స రమాదేవి తెలిపారు.